క్లుప్తంగా

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం.. ఉత్తరాయణం వైశాఖ మాసం ఆశ్లేష నక్షత్రం అష్టమి తిధి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మ నాయుడు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ప్రసన్నాంజనేయస్వామి రాతిముఖ మండపం పూర్తి



శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలోని రాతి ముఖమండపం

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో నూతన రాతి ముఖమండప నిర్మాణం పూర్తయింది. ఈనెల 14 నుంచి 19 వరకు మహాకుంభాభిషేకం వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థాన ఏసీ యం. తిమ్మనాయుడు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టీటీడీ దేవస్థాన చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి రూ. 2 కోట్లు నిధులు అందజేసి శంకుస్థాపన చేశారు. ఆ నిధులకు తోడు దాతలు అందించిన సహకారంతో రాతి ముఖమండపంతోపాటు గర్భాలయం, విమాన శిఖరగోపురం కూడా నిర్మించారు.

4 సచివాలయాల్లో ఆధార్ కేంద్రాల ఏర్పాట్లు

బల్లికురవ: మండలంలోని 4 సచివాలయాల్లో ప్రజలు చిన్నారుల కోసం ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ కుసుమకుమారి ఆదివారం తెలిపారు. నక్కబొక్కలపాడు మల్లాయపాలెం, కొణిదెన, వెలమవారి పాలెం, సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్‌లు ఈ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గతంలో తీయించుకున్న ఆధార్ కార్డులో తప్పులు ఉంటే తగిన ఆధారాలతో సరిచేయించుకోవచ్చని ఆధార్‌కార్డు లేని చిన్నారులకు జనన ధ్రువీకరణ పత్రంతో లేదా తల్లితండ్రి ఆధార్‌కార్డుతో కొత్త కార్డు పొందవచ్చని ఎంపీడీఓ వివరించారు.

ఘనంగా శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో శ్రీ నీలంపాటి శ్రీలక్ష్మి అమ్మవారు

యద్దనపూడి: మండలంలోని పూనూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ నీలంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి 23 వ తిరునాళ్ల మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు గణపతి పూజ, గురుప్రార్థన, 9 గంటలకు అష్టోత్తర సహస్రనామ పూజలు, 11 గంటలకు శ్రీలక్ష్మి గణపతి నవగ్రహ సమేత చండీ హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం కుంకుమార్చనలు, పంచామృతాభిషేకాలు చేశారు. రాత్రి 7 గంటలకు జోలకళ్ల భజనా బృందం వారిచే భజనా కార్యక్రమం నిర్వహించారు. తిరునాళ్లను పురస్కరించుకొని పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారికి పాల పొంగళ్లు, పసుపు కుంకుమలు, సారె సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

పంట పొలాల్లో అగ్నిప్రమాదం

జె.పంగులూరు: మండలంలోని తూర్పు తక్కెళ్ళపాడు పంట పొలాల్లో ఆదివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. మేదురి కాశియ్య కె. చెందిన కోత కోసిన మొక్కజొన్న కంపకు నిప్పంటుకోవటంతో చెలరేగిన మంటలు పక్కనున్న సుబాబుల్ అంటుకుంది. ఈ ప్రమాదంలో ఎనికపాటి సుందరరావు, ఎనికపాటి వెంకటేశ్వర్లు, కృష్ణకు చెందిన రెండెకరాల సుబాబుల్ తోటలు దగ్ధమవడంతో నష్టం వాటిల్లింది. అంతేకాక ఆయా పొలాల్లో ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ పంపు సెట్లకు సంబంధించిన పీవీసీ పైపులు, ప్యానల్ బాక్సులతో పాటు, స్ప్రింక్లర్ల గొట్టాలు కాలి బూడిదయ్యాయని రైతులు తెలిపారు. గొర్రెల కాపరుల అజాగ్రత్తవల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. వ్యవసాయ పంప్ సెట్లు ద్వారా నీటిని మళ్లించి మంటలు ఆర్పడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సుమారు రూ. 2.50 లక్షల నష్ట జరిగినట్లు రైతులు తెలిపారు.



మొక్క జొన్న పొలంలో మంటలు



చెన్నుపల్లి -అనంతవరం రోడ్డు



కంకరలేచిన లింకురోడ్డు



అధ్వాన స్థితిలో కొప్పరపాడు - కొత్తూరు రోడ్డు

మాయదారి పనులే!

- అధ్వానంగా లింకు రోడ్లు, ప్రధాన రోడ్లు
- మోకాటిలోతు గోతులు, కంకరపైకి లేచిన వైనం
- దారులను కమ్మిన చిల్లచెట్లు
- వంతెనకూలి పదేళ్లు అవుతున్నా పట్టించుకోని పాలకులు, అధికారులు
- 10 కిలోమీటర్ల ప్రయాణానికి 50 నుంచి 60 నిమిషాలు పట్టాల్సిందే..
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్న వాహనదారులు

బల్లికురవ: కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టి సంవత్సరం అవుతున్నా మౌలిక వసతులు కల్పించడంలో విఫలమవుతోంది. సంక్రాతిలోపు రహదారులపై గుంతలు కనిపించకుండా పూడ్చివేసి ప్రయాణ వసతి మెరుగుపరుస్తామని ఆర్భాటంగా ప్రకటించి ఇప్పుడు చేతులెత్తేశారు. దీంతో వాహన చోదకులు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పటం లేదు. బల్లికురవ మండలంలోని లింకురోడ్లు, ప్రధాన రోడ్లపై చారెడు గ్రావెల్, కంకరు వేసి గుంతలు పూడ్చిన దాఖలాలు లేవు. గోతులు, రోడ్లను చిల్లచెట్లు కమ్ముకోవటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. 10 కిలోమీటర్ల ప్రయాణానికి 50 నుంచి 60 నిమిషాల సమయం పడుతోంది.

అసంపూర్తి పనులతో అసంతృప్తి

నార్కెట్‌పల్లి - మేదరమెట్ల నాం రాహదారిలోని మండలంలోని రామంజనేయపురం నుంచి ముక్తేశ్వరం - గుంటుపల్లి - అంబడిపూడి - ఇసుకదర్శి మీదుగా చెన్నై - విజయవాడ జాతీయరహదారిని కలిపే లింకు రోడ్లకు చెందిన అసంపూర్తి పనులు శాపంగా మారాయి. ఈ రోడ్డులో రామాంజనేయపురం - ముక్తేశ్వరం గ్రామాల మధ్య చెన్నుపల్లి మేజర్ కాల్వను దాటే చోట వంతెనకు ఇరువైపులా ఉన్న గోడలు పడిపోయి పదేళ్లు అవుతోంది. ఇక్కడ ప్రమాదం పొంచి ఉంది. బైకులు, ఆటోలు మినహా ఇతర వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. ముక్తేశ్వరం-గుంటుపల్లి, అంబడిపూడి-ఇసుకదర్శి మధ్య లింకు రోడ్ల అభివృద్ధికి రూ. 3 కోట్ల నిధులు ఉపాధి హామీ పథకంలో మంజూరైనా.. అసంపూర్తి పనులతో వాహన చోదకులకు అవస్థలు తప్పటం లేదు. రోడ్లను చదరం చేసి మెట్‌మిక్స్ వేసి తారు వేయక పోవడంతో కంకర లేచి రాకపోకలకు ఇబ్బందులే తప్పటంలేదు. కొప్పరపాడు - కొత్తూరు - వెలమవారిపాలెం లింకు రోడ్డు అడుగు అడుగుకు తొయ్యి చిల్ల చెట్లు కమ్మటంతో 8 గ్రామాల ప్రజలకు నిత్యం ఇబ్బందులే. రహదారి సక్రమంగా లేనందున ఈ రోడ్డులో తిరిగే పల్లెవెలుగు బస్సును ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. కొణిదెన - గంగపాలెం-వేమవరం జంక్షన్- ఉప్పుమాగులూరు రోడ్ల గోతుల మయమే, కొప్పరపాలెం- కోటావారిపాలెం-ఉప్పుమాగులూరు రోడ్డు, బల్లికురవ-నాగరాజుపల్లి-మార్టూరు, బల్లికురవ- కొణిదెన-మార్టూరు, బల్లికురవ-కొణిదెన-మార్టూరు రోడ్ల గోతులు మయమే చెన్నుపల్లి -అనంతవరం రోడ్డు అధ్వాన స్థితికి చేరింది. ఆర్ అండ్ బీ పంచాయతీ రాజ్ శాఖల ఆధీనంలో ఉన్న ఈ రోడ్ల అభివృద్ధికి అధికారులు అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపుతున్నా కార్యరూపం దాల్చటం లేదని వాపోతున్నారు.



చెన్నుపల్లి మేజర్ కాల్వ దాటేచోట కూలిన వంతెన గోడలు



చిల్లచెట్లతో మూసుకుపోయిన రామాంజనేయ పురం - ఇసుక దర్శి లింకు రోడ్డు

వంతెన విస్తరణతో రోడ్లు అభివృద్ధి చేయండి



రామాంజనేయపురం- ఇసుకదర్శి లింకు రోడ్ల ద్వారా మూడు మండలాల్లోని 40 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. చెన్నుపల్లి మేజర్ కాల్వ దాటే చోటే వంతెన గోడలు కూడటం, ముక్తేశ్వరం -గుంటుపల్లి, అంబడిపూడి- ఇసుకదర్శి మధ్య అసంపూర్తి అభివృద్ధి పనులతో ప్రయాణం సాగటంలేదు.

– బూసా వెంకటేశ్వర్లు (రామాంజనేయపురం)

8 గ్రామాల లింకురోడ్లను అభివృద్ధి చేయండి

కొప్పరపాడు-కొత్తూరు-వెలమవారిపాలెంలో లింకు రోడ్డుకు రోడ్డుకు మోకాటిలోతు గోతులు, చిల్లచెట్లు పెరగటంతో 8 గ్రామాల ప్రజలకు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి అద్దంకి నుంచి కొత్తూరు- వెలమవారిపాలెం మీదుగా మైలవరం బస్సు మళ్లీ నడపాలి.

– హింసావత్ కిషోర్ నాయక్ (కొత్తూరు)

వేసవి విజ్ఞాన శిబిరాలు మాయం

- గ్రంథపాలకుడు పదవీవిరమణ చేయడంతో తిప్పలు

అద్దంకి: పట్టణంలోని గ్రంథాలయానికి సొంత భవనం లేదు సరికదా.. గ్రంథపాలకుని పోస్టున్నా డిప్యూటేషన్లతోనే గడిచిపోతోంది. ఇక్కడ గ్రంథపాలకునిగా పనిచేసిన సుగుణరావు ఫిబ్రవరిలో రిటైర్డ్ కావడంతో పాఠకులకు అవస్థలు తప్పడంలేదు. మద్దిపాడు గ్రంథపాలకురాలు వసుందరాదేవిని అద్దంకి ఇన్‌చార్జిగా నియమించారు. అయితే గ్రంథాలయం కేవలం ఆది, మంగళ, గురువారాల్లో తెరచి ఉంటోంది. ఈ క్రమంలో విద్యార్థుల వికాసం కోసం ప్రభుత్వం.. గ్రంథాలయ శాఖ వేసవి విజ్ఞాన శిబిరాలను 40 రోజుల పాటు నిర్వహిస్తోంది. అయితే అద్దంకి గ్రంథాలయానికి ఇన్‌చార్జి గ్రంథపాలకురాలు కావడంతో వేసవి శిబిరాలు నిర్వహించలేకపోతోంది. 50 వేల జనాభా, వివిధ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థుల దృష్ట్యా, గ్రంథాలయానికి పూర్తి స్థాయి గ్రంథపాలకుని నియమించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో ఆదివారం 6వ రోజు వేసవివిజ్ఞాన శిబిరాలు నిర్వహించారు. లైబ్రేరియన్ బాదం విజయ భాస్కర్ రెడ్డి విద్యార్థులచే క్యారంబోర్డు, చెస్, పిన్‌బోర్డు ఆటలు ఆడించారు. కార్యక్రమంలో 14 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



సంతమాగులూరు: గేమ్స్ ఆడుతున్న విద్యార్థులు

భక్తుల కొంగు బంగారం పోలేరమ్మ తల్లి



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న తోటవారిపాలెం పోలేరమ్మ తల్లి



తిరునాళ్లకు సిద్ధమైన తోటవారిపాలెం పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం

- 56వ శిడిమహోత్సవం, తిరునాళ్లు రేపు

చీరాల టౌన్: కోరిన కోర్కెలు తీర్చి భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న తోటవారిపాలెం శ్రీ పోలేరమ్మ తల్లి శిడి మహోత్సవం మంగళవారం వైభవంగా జరగనుంది. బాపట్ల జిల్లాలో పెద్ద ఎత్తున జరిగే తోటవారిపాలెం పోలేరమ్మ తిరునాళ్లకు ఎంతో విశిష్టత ఉంది. గత 55 ఏళ్లగా ప్రతి ఏడాది అమ్మవారి తిరునాళ్లను ఘనంగా నిర్వహిస్తారు. భక్తుల పాలిట కొంగు బంగారంగా ఉండే తోటవారినాలెం పోలేరమ్మ అమ్మవారి గుడి అంటే ప్రసిద్ధికెక్కింది. ప్రతి మంగళ, ఆదివారాల్లో భక్తులు విరివిరిగా వచ్చి విశేష పూజలను నిర్వహిస్తుంటారు. ఆపదలో ఉన్న భక్తుల కష్టాలు, కోర్కెలను తీర్చే తల్లిగా పోలేరమ్మ తల్లికి పేరుంది. అందుకే ప్రతి ఏడాది అమ్మవారి తిరునాళ్ల, శిడి మహోత్సవాన్ని ఘనంగా జరుపుతారు. తిరునాళ్లు వైభవంగా నిర్వహించేందుకు అన్నీ ఏర్పాట్లు సిద్ధం చేశారు. తిరునాళ్ల రోజు శిడి పెళ్లి కొడుకుతో ఊరేగింపుగా అమ్మవారి గుడికి వెళ్ళి గుడి వద్ద ఉండే శిడి మానుకు ఒక పెట్టెలో మేకపోతునుంచి, గుడి చుట్టూ మూడు ప్రదక్షిణలు చేస్తారు. ఈ సమయంలో శిడిమాను పైభాగంలో చెక్కపెట్టెలో ఉంచిన మేకపోతును భక్తులు జీడికాయలతో కొడుతుంటారు. శిడిమాను లాగితే కష్టాలు తొలిగిపోతాయని భావించే భక్తులు శిడిమాను బండిని లాగేందుకు పోటీ పడతారు. అలానే తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేకంగా విద్యుత్ ప్రభలు ఆకర్షణగా నిలుస్తాయి. ఈ ఏడాది ప్రభలతో పాటు మ్యూజికల్ నైట్, నాటికలు, కళాకారులతో ప్రదర్శనలు చేయనున్నారు. తిరునాళ్లను పురస్కరించుకొని పశు సంపదతో పాటు వాహనాలను గుడి చుట్టూ తిప్పి ప్రజలు తమ మొక్కులు తీర్చుకుంటారు. బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, పల్నాడు చీరాలతో పాటు పరిసర గ్రామాల నుంచి తిరునాళ్లను చూసేందుకు ప్రజలు వేలాది సంఖ్యలో వస్తుంటారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

ఇంకొల్లులో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



ఇంకొల్లులోని అభయాంజనేయ స్వామి

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని ఇంకొల్లు నాగుల చెరువు కట్టపై వేంచేసియున్న అభయాంజనేయ స్వామి ఆలయ 10 వ వార్షికోత్సవం పురస్కరించుకొని ఆలయంలో ఆదివారం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సహస్రనామాలతో స్వామి వారికి తమలపాకు పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సువర్చల సహిత ఆంజనేయ స్వామి వారి కళ్యాణ మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం 2 వేల మందికి అన్నదానం చేసినట్లు కమిటీ సభ్యులు తెలియజేశారు.

ప్రత్యేక అలంకరణలో ఈర్లగంగమ్మ

బల్లికురవ: వైశాఖ మాసం ఆదివారం సప్తమి తిధి సందర్భంగా నక్కబొక్కలపాడు గ్రామ సమీపంలోని ఈర్లగంగమ్మకు ప్రత్యేక అలంకరణతో పూజలు చేపట్టారు. నక్కబొక్కలపాడు, కొత్తపాలెం, బల్లికురవ, చెన్నుపల్లి, కొండాయపాలెం, పాత మల్లాయపాలెం, సోమవరప్పాడు, కొప్పరపాలెం, గ్రామాలతోపాటు పల్నాడు, బాపట్ల జిల్లాలోని భక్తులు ఉదయం 6 గంటలనుంచే భారీగా తరలివచ్చారు. అమ్మవారి సన్నిధిలో పొంగల్లు పెట్టి నివేదించి తమమొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు చల్లగుండ్ల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు.



అలంకరణలో పూజలందుకున్న ఈర్లగంగమ్మ

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ తిరునాళ్ల



పోలేరమ్మ పూజా కార్యక్రమాల్లో భక్తులు

చినగంజాం: మండలంలోని సోపిరాల గ్రామంలోని గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ వేడుకలు నాలుగు రోజులు పాటు నిర్వహించనుండగా మొదటి రోజు అమ్మ వారికి గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి సద్దులు వెంట తీసుకొని మేళతాళాలతో డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో తిరుగుతూ ఆలయం వద్దకు వెళ్ళి అమ్మవారికి సమర్పించుకున్నారు. సాయంత్రం వడపప్పు, పానకం తీసుకొని వెళ్ళి అమ్మవారికి సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. పోలేరమ్మ అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పూజా కార్యక్రమంలో అందరూ పాల్గొని హారతులు అందుకున్నారు.



సోపిరాల గ్రామంలోని పోలేరమ్మ అమ్మవారి శిలలు

ఆలయ వార్షికోత్సవానికి భారీ ఏర్పాట్లు



పావులూరులో ఆలయ వార్షికోత్సవానికి సిద్ధమవుతున్న ఆలయం

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని పావులూరు పొలిమేర ఆంజనేయ స్వామి వారి 71 వ వార్షిక జయంచి మహోత్సవ కార్యక్రమాలు మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 10వ తేదీ శనివారం ఉదయం 7 గంటలకు అంకురార్పణ, అఖండ కలశ స్థాపనతో హనుమజ్జయంతి ఉత్సవం ప్రారంభం అవుతుంది. 10 గంటలకు మారుతీ భజన సమాజం వారిచే భజన కార్యక్రమం, మధ్యాహ్నం 1 గంటకు ఒంగోలు మాకేపల్లి నాగకుమార శర్మచే ఉపన్యాసం, 3 గంటలకు విజయవాడకు చెందిన బుర్రా నరసింహ శర్మ భాగవతార్ చే హరికథ ఉంటుంది. సాయంత్రం 6.30 గంటలకు నెల్లూరు రావెళ్ళ భారతిచే హరికథ, రాత్రి 10 గంటలకు అద్దంకి శ్రీనివాసరావు బృందంచే చింతామణి నాటక ప్రదర్శన జరగనుంది. 11వ తేదీ ఉదయం 10 గంటలకు మచిలీపట్నం మడమల రాంబాబుచే హరికథ, మధ్యాహ్నం 1 గంటలకు తెనాలికి చెందిన మునుకుట్ల విశ్వనాథ శర్మచే ఉపన్యాసం, సాయంత్రం 4 గంటలకు మొగిలిచర్ల నాగమణి హరికథా కాలక్షేపం నిర్వహిస్తారు. రాత్రి 8కి భరణి కూచిపూడి నృత్య కళాశాల వారిచే భరతనాట్యం, 12వ తేదీ సోమవారం ఒంగోలు పిడుగు వేదవల్లి భాగవతారిణిచే హరికథ, మధ్యాహ్నం 12 గంటల నుంచి సువర్చలా సహిత ఆంజనేయ స్వామి వారి కళ్యాణ మహోత్సవం జరుగుతాయని ఆలయ కమిటీ వారు తెలియజేశారు. వివిధ అన్నదాన సత్రాలు భక్తులకు అన్నదానాలు నిర్వహిస్తూ ఉంటాయని తెలిపారు.

మద్యం దుకాణంలో సిట్టింగ్ పర్మిట్ ఇవ్వొద్దు



అవగాహన ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు

స్వర్ణ (కారంచేడు): జన సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణంలో సిట్టింగ్ పర్మిట్‌లు ఇవ్వొద్దని సీపీఎం నాయకులతో పాటు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని స్వర్ణ గ్రామంలో ప్రజాభిప్రాయంకు వ్యతిరేకంగా చీరాల రోడ్డులో మద్యం దుకాణంను ఏర్పాటు చేసారని, అక్కడ కేవలం కొనుగోలు చేసే విధంగా మాత్రమే అనుమతులున్నాయని, అయితే అక్కడ కొంత మంది కూర్చొని మద్యం తాగుతుండటం వలన పలు సమస్యలు ఎదురవుతున్నాయని టి. ఆదినారాయణ, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో అవగాహన ర్యాలీని చేశారు.

నేడు మార్టూరులో ఉపాధ్యాయుల నిరసన

మార్టూరు: అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం మార్టూరులో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిలర్ మాడుగుల కిషోర్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న నిరసన ప్రదర్శనలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. పాఠశాలల ప్రభుత్వ విధ్వంసకర విధానాలకు వ్యతిరేకంగా పదోన్నతుల సీనియారిటీ జాబితాలను రాష్ట్రమంతటా ఏకరీతిగా తయారు చేయాలని, విద్యాబోధన మాతృభాషలో నిర్వహించాలని తెలిపారు. తెలుగు, ఇంగ్లిష మీడియాల సెక్షన్‌లను వేరువేరుగా నిర్వహించాలని, 11 వ పీఆర్‌సీ బకాయిలను విడుదల చేయాలని, 12 వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి ఐఆర్ ప్రకటించాలని కోరారు. సీపీఎస్, జీపీఎస్‌లు రద్దు చేయాలని తదితర డిమాండ్ల కోసం ఉపాధ్యాయులంతా ఏకతాటిపై తరలివచ్చి ప్రదర్శన జయప్రదం చేయాలని కిషోర్ బాబు పిలుపునిచ్చారు.

ఘనంగా బ్రహ్మంగారి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి

యద్దనపూడి: మండల కేంద్రమైన యద్దనపూడిలో వేంచేసి ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 57 వ ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం లోక కల్యాణార్థం శాంతి కల్యాణం నిర్వహించారు. శాంతి హోమంలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల వెంకట సుబ్బారావు, ఉండవల్లి సత్యనారాయణ, కోటా రఘుబాబు, గోనుగుంట్ల నాగాంజనేయులు, షణ్ముకాచారి దంపతులు పాల్గొన్నారు. ఆలయ పర్యవేక్షకురాలు కొప్పవరపు సుందరమ్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండల పరిధిలోని చిమటవారిపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న బాల అంకమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకులు నారాయణం శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.